కథ

# స్పృహ

వి.సత్యసురేఖ




"జరగుండ్రమ్మా, జరుగుండ్రి తొవ్వల్నె నిల్సుంటె ఎక్కెటోళ్ళు ఎట్లెక్కుతరు" అంటూ ఎక్కుతోందా పల్లీలమ్మాయి.

"ఎక్కడికి జరగాలి రైల్లోంచి కిందపడాలా, అయినా నిల్చో డానికే స్థలం లేదు.. నీ పల్లీలెవరు కొంటారు?" కొద్దిగా హెచ్చిన స్వరంతోనే అందా నడివయస్సావిడ.

"కొనేటోల్లు కొంటరు. నువు గాదు గద" సమాధానం చెప్పి ముందుకు సాగడానికి ప్రయత్నిస్తున్న ఆ అమ్మాయిని అంతో ఇంతో అందరూ విసుక్కుంటున్నారు.

"అయినా ఖాళీగా ఉన్నప్పుడు అమ్ముకోవాలి. ఇలా చేస్తే ఎంత ఇబ్బంది." – ఎవరో అంటున్నారామెతో.

"మీ కేందమ్మా. ఇండ్లల్ల తెచ్చెటోల్లున్నరు. మాకెవలు తేవాలె. ఎవలు పెట్టాలె." – కఠినంగా అన్నా గొంతులో బాధ ధ్వనించింది.

పాపం అనిపించింది నాకు. నిజమేమరి. ఉద్యోగాలో, వ్యాపారాలో చేసుకొంటూ కొంత ఆర్థిక సుస్థిరత ఉన్నవారికి, రెక్కాడితే గాని డొక్కాడని వారి పరిస్థితి ఎలా అర్థమవుతుంది. నేనున్న చోటకు ఆమె వస్తే పల్లీలు కొందామని నిర్ణయించుకొన్నాను.

పండగ తెల్లారే కావడంతో రైళ్ళన్నీ క్రిక్కిరిసి ఉన్నాయి. రైలు పెట్టె రెండో మెట్టుమీద సైతం నుంచొని ప్రయాణించడానికి జనం వెరవట్లేదు. నేనెక్కిన రైలూ ఇందుకు భిన్నంగా లేదు. అందులోనూ పగలు వెళ్ళే ఆఖరి రైలు ఇదే కావడంతో, అంతవరకూ భయపడి – రైళ్ళను వదిలివేసిన వారు సైతం ఇప్పుడు విజయమో, వీరస్వర్గమో అని ఎక్కేసారు.

నిజానికి రైల్వే కనుక ప్రైవేటు వారికిస్తే, ఇలాంటి రోజుల్లో ఓ రెండు స్పెషల్ ట్రైన్స్ వేసి, వీలయితే మొదటివారంలో ఎంతయినా పెంచుకొనే సినిమా టిక్కెట్లలా, ఛార్జీలు పెంచేసి సంస్థకి ఆర్థికాభివృద్ధిని ఒనగూర్చేవారు. ఛార్జీలు పెంచకపోయినా కనీసం స్పెషల్ ట్రైన్స్ వేసైనా రైల్వేవారు తమ సంస్థకి ప్రయోజనం చేకూర్చుకొంటే బాగుండేది.

రైలు ప్లాట్‌ఫారం పైకి వచ్చినప్పుడు వదిలేద్దామనుకొన్నాను. కాని తప్పనిసరిగా ఈ రాత్రికి హైదరాబాదుకు చేరాల్సిన అవశ్యకత నన్ను రైలెక్కించింది. ఎలాగోలా పైన సామాన్ల నిమిత్తం రైల్వేవారు ఏర్పాటుచేసిన బెర్తులో అంగుళాలలెఖ్ఖన చోటు సంపాయించుకో గలిగాను. ఆ సమయంలో నా విజయాన్ని విక్రమార్క విజయంతో పోల్చుకోవడమే సబబనిపించింది.

కాని నా కన్నా కూడా ఆ పల్లీలమ్మాయి గొప్పదనిపించింది. ఇంతటి దుర్భేధ్య పద్మవ్యూహాన్ని ఛేదించుకొంటూ వస్తున్న ఆ అభినవ అభిమన్యుని చూడాలన్న పట్టుదల సైతం పెరిగింది.

✿ ✿ ✿

చివరకు రానే వచ్చింది ఆ అభిమన్యుని. అప్పుడు చూసా నామెను పరీక్షగా నల్లగా – ఓ మాదిరి ఎత్తుతో, ఒళ్ళంతా చెమట కారుతూ, మాసిన ఆకుపచ్చ చీర, మ్యాచింగ్ లేని కాఫీపొడి రంగు బ్లౌజు, చేతులకి ఎర్రటి మట్టిగాజులు, మెడలో మురికి పట్టిన పసుపుతాడు, నుదుటన చెమటకు జారుతున్న ఎర్రటిబొట్టుతో – ప్రదర్శనలిచ్చే అందం కాకపోయినా, శ్రామిక కళతో అందంగానే కనపడింది నాకు.

"ఓ రెండ్రూపాయల పల్లీలియ్యమ్మా" అన్నానామెతో. అన్నానే గాని నాచేయి పాంటు జేబులోకి పోవాలి. డబ్బులు తగలాలి. ఆ పైన వాటిని తీయగలగాలి. ఆమెకివ్వగలగాలి. అక్కడితోనే ఆగిపోదు ప్రస్థానం. ఆమె చేతిలోని పల్లీలు తీసుకోగలగాలి.

ఇలా నేను ఆలోచనల్లో ఉండగానే, ఆమె చాకచక్యంగా వారి నుండి వీరికి, వీరి నుండి వారికి – ఒలింపిక్ జ్యోతిని అందించినట్లు అందిస్తూ – రాతి గోడల్ని తలపింపజేసే లగేజిని సైతం సునాయాసంగా ఛేదించి పల్లీలు నాకందజేసింది.

ఈసారి విక్రమార్క విజయం ఆమెదని పించింది. కాని నాకు మాత్రం డబ్బులు తీసివ్వడం దుస్సాహసం అనిపించింది. నేను చేయి కాదు గదా, వేలు కదిపినా బ్యాగులు, బుట్టలు, సంచులు, సూట్‌కేసులు అన్ని ఎత్తునుండి పళ్లానికి దొర్లిపడే పళ్ళలా – పడేట్లున్నాయి.

అందుకని ఈసారి విక్రమార్కుడి బదులు భేతాళ పాత్ర ధరించి "అమ్మా! నువ్వెక్కడ దిగుతావు" అనడిగాను.

''ఎందుకు సారు'' అనుమానంగా అడిగింది. నేనడిగిన ప్రశ్న తప్పుగా తోచింది నాకు.

"కాదమ్మా ! నేను సికింద్రాబాదులో దిగుతాను. ఇప్పుడు పైసలియ్యాల్నంటే కష్టం. రైలు ఖాళీ అయినాక ఇస్తాను సరేనా !" నేనిచ్చే బోడి రెండు రూపాయలకు వాగ్దానం ఒకటి. ఆ అమ్మాయే కాదు, చుట్టుపక్కల వారూ ఏమను కొన్నారో అనిపించింది.

నా మొహం కేసి ఓ నిమిషం తదేకంగా చూసి, ఏమనుకుందో ఏమో సరేనంది.

కాస్త ముందుకెళ్లాక ఎవరో తరువాత ఇస్తానంటే మాత్రం ఒప్పుకోలేదు. నా మొహంలో కళ్ళూ, ముక్కు కన్నా నిజాయితీ స్పష్టంగా కనబడినందుకు నన్ను నేనే అభినందించుకొన్నాను.

✿ ✿ ✿

చచ్చీ చెడి సికింద్రాబాదు చేరింది రైలు. ఎక్కడానికి కంగారుపడాలి గాని దిగడానికి కూడా కంగారుపడుతున్న వారిని చూసి 'ఏమిటో ఈ జనం' అనుకున్నా.

రైలు ఖాళీ అయ్యాక మెల్లగా పై నుంచి కిందికి దిగాను. నా బ్యాగు భుజానికి వేసుకొని అటూ ఇటూ చూసాను ఆ అమ్మాయి కోసం.

పక్క కంపార్టుమెంటులోంచి మెల్లగా నడుచుకుంటూ వచ్చిందా అమ్మాయి. రెండ్రూపాయలిస్తే ఆ అమ్మాయి వెళ్ళిపోతుంది. కాని నాకు మాత్రమే అరువుకి పల్లీలు ఎందుకిచ్చిందో తెలుసుకోవాలనిపించింది. అదే విషయం ఆ అమ్మాయినడిగాను.

"అదా సారూ, మిమ్ముల నేను మస్తుసార్లు జూసిన. నాకాడ మీరింతకుముందుకూడ పల్లీలు కొన్నరు. గందుకనే ఇచ్చిన".

"అవునా ! నాకు గుర్తులేదే. నేను గుర్తుపట్టలేదు. ఏమీ అనుకోకు" అన్నా కొద్దిగా క్షమాపణ ధోరణిలో.

"మంచిగున్నవు సారు. మీ అసంటోల్లను మేము గుర్తుంచుకోవాలెగని, మా అసోంటోళ్ళను మీరెందుకు గుర్తుంచుకోవాలె" అన్నది.

ఆమాట ఆమె మామూలుగా అన్నా – నా గుండెను ఎక్కడో గుచ్చింది. నిజమే మరి. రాజకీయనాయకులు గాని, సంఘసంస్కర్తలమని చెప్పుకొనేవారు గాని, సమాజం గురించి గంటల తరబడి చర్చించుకొనే నాలాంటివారు గాని – ఎవరు గుర్తుంచుకుంటున్నారు వారిని.

రాజకీయ నాయకులు వాగ్దానాలకే సరి. కనీసం వాగ్దానాలిచ్చేప్పుడైనా వాళ్ళ మొహాల్ని సరిగ్గా చూస్తారన్న నమ్మకం లేదు. ఇంక గుర్తుంచుకోవాలన్న సమస్య ఎక్కడిది. ఈ మధ్య సంఘసంస్కర్తలు, సంక్షేమ సంఘాల వారు కూడా అదే దారిలో నడుస్తున్నారు. బ్రాండ్‌నేమ్‌లా పేరొచ్చేంతవరకే వీళ్ళతో పని. పేరొచ్చాక వీళ్ళను గుర్తుంచుకొనే పనే లేదు.

ఇక మిగిలింది నాలాంటివారు. ఇవే పల్లీలు తింటూ సమాజం గురించి గంటల తరబడి కాలక్షేపపు చర్చలే తప్ప – కనీసం పల్లీలమ్మిన వారి మొహాలు కూడా చూడని – నా సామాజిక స్పృహ మీద నాకే అసహ్యమేసింది.

"సార్ పైసలు" నా ఆలోచనల్లో నేను న్నాను. పాపం రెండు రూపాయల గురించి ఆ అమ్మాయిని పదినిమిషాలు వేచి వుండేలా చేశానను కొంటూ డబ్బులిచ్చాను.

డబ్బులు సంచిలో వేసుకొని, బుట్ట నెత్తుకొని వెళ్ళిపోతోతుండగా "అవును. ఒకవేళ నేనివ్వకుండా వెళ్ళిపోతే" ఎందుకో అడగాలని పించింది. అడిగాను.

"ఏమయితది సార్. ఆకలేసినోనికి పల్లీలిచ్చి ననుకుంట" ఎంతో శాంతంగా చెప్పిన ఆమె సమాధానం" మీరు ఎవరి దయాదాక్షిణ్యాల మీద బతుకుతున్నారో ఇప్పటికైనా అర్థమైందా!" అని యావద్భారతాన్ని ప్రశ్నించినట్లనిపించింది నాకు.

## నేనూ అక్షరాన్నే కానీ....

అక్షరం వణుకుతోంది
రుతుభ్రమణం తెచ్చిన చలి కాదిది
రాజకీయ రుతువు చలిమంట వేసి
అక్షరం రాజుకునేలా చేసింది
చావో రేవో తేల్చుకోమంది
భావాల్ని మంటలో వేసి
ఓ దేహం బయటపడింది
పుట్టిన శిశువు వివర్ణమైంది
ఆశ్రయం కోరేది అక్షరం కాబోదు
ఆశ్రయం ఇవ్వనిది రాజ్యం కాబోదు
అస్తిత్వం ఊపిరైన చోట
అక్షర భ్రమణం అడ్డదిడ్డమౌతుంది
ముక్కుకు పని చెప్పటమే బతుకైనపుడు
ముక్కు మూసుకోపటం చావు కాదు.
తనదైన రంగుతో ఎగరాల్సిన జెండా
అరువుతెచ్చుకున్న ఊపిరితో
మేరా భారత్‌కీ జై అంటూ రెపరెపలాడుతోంది
ఓ అక్షరం శతాఘ్నిలా ముందుకురికి
లక్ష్యాన్ని ఛేదించి తిరిగొచ్చి
తనపై తానే పడింది.
అక్షరమూ రాజకీయ విలువలూ రెండూ
మట్టికొట్టుకుపోయిన నేలమీద
నాగరికతల ఆనవాళ్లు వెదుకుతూ
మరో అక్షరాన్ని నేను

– డాక్టర్ సత్రీ